

# "పూర్తికాని చిత్రాలు"

— అరవింద

క్రథ రాద్దామంటే ఏదో జంకు ... చిన్నతనం.

విధికంటే గొప్ప రచయిత ఎవరు ? విధి రాసినన్ని కథలు ఏ రచయిత

రాయలేదు....రాయలేదు.

విధిరాసిన కథలు చదివి రచయిత లందరూ తలలు ఒంచాల్సిందే.

మనం ఈ ప్రపంచం ఆధారంగా కథలు రాస్తున్నాం.

ఏ వాస్తవం ఆధారంగా ఈ రచన సాగిస్తోందో కదా విధి !

కొంతమంది మనుషుల్ని చూస్తుంటే వీళ్ళ చిత్రం గీయటం అసాధ్యం అని పిస్తుంది.

* * * *

కూరల కోసం మార్కెట్‌కి వెళ్ళాను. నేను వుల్లిపాయలు కొంటూచూశాను. కొంత దూరంలో వాణి అరటికాయలు బేరంచేస్తోంది. వాణిని చూడగానే నాలో కుతూహలంరేగింది. ఉల్లిపాయలు తూస్తుంటే అటుచూడకుండా వాణినే చూస్తున్నాను. వాణి వెళ్ళిపోతుందేమో, వెళ్ళి పలకరించనా !

ఉల్లిపాయలు సంచిలో వేయించు కుని గబగబ అటునడిచాను. వాణి అరటి కాయలు కొనుక్కుని ప్లాస్టిక్ బేగ్‌లో వేయించుకొని ఊపు కుంటూ టమేటోల దగ్గిరికి వెళ్ళింది.

వాణిని చూడగానే అనిపిస్తుంది మహా చురుకు అని.

తెలివి తేటల సంగతి చెప్పటం కష్టం ఎందుకంటె వాళ్ళఅక్కయ్య లలితబి.ఎ. చదివింది. వాణి మెట్రిక్‌తో ఆపేసింది.

పోనీ లెద్దురూ. ఏం చదువో. నాకు ఆ పుస్తకాలూ పాఠాలూ చూవాలనీ ఉండదు" అంది.

వాళ్ళమ్మ నాతో చెప్పింది "వాణి చదవనంటోంది. కొంచెం మీరు చెప్పి చూడండి. కట్నాలు ఇవ్వలేం. చదువు చెప్పిస్తే ఏదో ఉద్యోగమేనా చేసు కుంటుంది" అని.

నేను వాణిని ఆ విషయం అడిగితే వాణి అన్నమాట అది "పోనీలెద్దురూ."

లలితకి ఉద్యోగం దొరికింది ఇన్సూరెన్సు కంపెనీలో, వెంటనే ఒక సంబంధం కూడా వచ్చింది. ఆ అబ్బాయిది ఈ ఊరే. కంపెనీలో పని చేస్తూ ఎనిమిది వందలు తెచ్చు కుంటున్నాడు. పెళ్ళి చూపులు అయ్యాయి. లలిత నచ్చిం దన్నాడు.

ఇద్దరి మధ్యా మాటలు సాగు తున్నాయి. పెళ్ళయినా లలిత ఉద్యోగం చేసేటట్లు, తల్లికి ఆర్థికంగా సాయ పడు తుందని. లలితకి ఒక తమ్ముడు కూడా ఉన్నాడు, కాలేజీలో చదువుతున్నాడు... ముహూర్తం నిశ్చయం చేస్తుండగా రంగనాధ్ అంటే లలితని చేసుకుంటా ననుకున్నవాడు వాణిని పెళ్ళి చేసు కుంటానన్నాడు.

లలిత సన్నగా పొడుగ్గా ఉంటుంది. మనిషి ఆలోచించేరకం చాలా పొందికగా మాట్లాడుతుంది, నిదానంగా ప్రవ ర్తిస్తుంది.

వాణి అంత పొడుగ్గా ఉండదు,

బొద్దుగా ఉంటుంది. గుండ్రని మొహం నొక్కులుగాఉండే పొట్టి జడ వాణి మాట్లాడుతుంటే కనుపాపలు చేపపిల్లల్లాగా మిలమిలలాడుతుంటాయి. తను నవ్వుతూ ఎదుటవాళ్ళని నవ్విస్తుంటుంది, ఏదో మాట విసిరి.

అప్పటికీ రంగనాథ్‌ని "బావగారూ" అని పిలవటం మొదలు పెట్టింది, అతడి బైక్‌మీద రెండుసార్లు మార్కెట్‌కి ఒకసారి డాక్టర్ దగ్గిరికీ వెళ్ళివచ్చింది. "రిక్షాకి డబ్బులు దండగ పెట్టడ మెందుకూ..." అంటూ.

అతడు వాణిని చేసుకుంటానన్నాడు. వాణికూడా ఒప్పుకుంది.

"తల్లి నెత్తిబాదుకుని ఏడుస్తుంటే.

"ఎందు కూరికే ఏడుస్తావు? వాళ్ళిద్దరికీ ఇష్టమైంది. చేసెయ్యండి" అంది లలిత.

కామ్ వాటర్స్ రన్ డీప్....లోతైన నది లలిత. లలిత కూడా మనిషే కదా. ఎంత గాయపడిందో పాపం.

తల్లి ఇట్లాగ ఆలోచిస్తుండగానే వాణి, రంగనాథ్ రిజిష్టర్ మారేజ్ చేసేసుకున్నారు. తమ్ముణ్ణి తనే చదివిస్తానంది వాణి. రంగనాథ్ ఒప్పుకున్నాడుట.

"ఇంక ఏడుపు మానెయ్యి. నీ కెంత ఖర్చు తగ్గించానో చూడు!" అందిట వాణి తల్లితో.

లలితకి ఇంకా పెళ్ళి కాలేదు. ఉద్యోగం చేస్తూనే వుంది.

వాణి పెళ్ళి అయినప్పుడు నేను ఇక్కడ లేను. ఊరికెళ్ళాను. తరువాత వాణితో మాట్లాడలేదు నేను. వాళ్ళింటికి వెళ్ళిపోయింది వాణి. ఇవేళ ఇక్కడ కనిపించింది. నవ్వుతూ తిరిగే ఈ పిల్ల మనసులో ఏముంటుందో అని నాకు గుర్తు వచ్చినప్పుడల్లా అనిపిస్తూనే వుంటుంది.

వాణి టమేటోలు తీసుకుని నాకు ఎదురు వచ్చింది. నన్ను చూస్తూనే "నమస్కారమండీ" అంది.

"పెళ్ళి అయిందట కదూ. బాగున్నారా!" అన్నాను.

"ఆ. చాలా బాగున్నాను" అంది వాణి నవ్వుతూ.

కాలికట్ చీర కట్టుకుంది. చెవులకి పెద్ద రకం దుద్దులు పెట్టుకుంది. ఇదివరకు కంటే కూడా బాగుంది. ఔను. రంగనాథ్ బాగానే సంపాదిస్తున్నాడు.

కానీ లలిత అదృష్టాన్ని దోచుకుంది వాణి. ఈ మాటే నా మనసులో పీకుతోంది.

నువ్వు చాలా అదృష్టవంతురాలివి. పాపం లలితే దురదృష్టవంతురాలు!" అన్నాను. వాణి నవ్వింది.

"అమ్మా ఇట్లాగే బాధపడిపోతుంది. లలిత కేం తక్కువ! చదువు కుంది, హాయిగా ఉద్యోగం చేసుకుంటోంది. నాకే పెళ్ళవగా లేనిది

దానికి కాదా! బుద్ధి ఉన్నవాడెవడైనా కళ్ళ కద్దుకుని మరీ చేసుకుంటాడు లలితని" అ ది.

వాణి మాటలు విని ఊరుకోలేక పోయాను.

"నీకేం కబుర్లు చెప్తున్నావు! పెళ్ళిళ్ళు అంత తేలికగా అవటం లేదు. మరి బుద్ధి ఉన్న వాళ్ళు చాలా తక్కువగా ఉన్నారేమో మన సంఘంలో. లేకపోతే బుద్ధిలేని వాళ్ళే సుఖపడగలరో! లలితకి నిశ్చయమైన కుర్రాణ్ణి నువ్వు చేసుకున్నావు కదా... నీ ఇష్టం మీదే జరిగింది కదా... మీ అక్కయ్యని మోసం చేసినట్లనిపించటం లేదు నీకూ!" అన్నాను.

వాణి ఒబ్బరంగా తల ఊపింది అడ్డంగా.

"లేదు. ఇంకా మేలు జరిగిందనే నేను అంటాను. రంగనాధ్‌కి నేను నచ్చాను. నేనంటే చాలా ఇష్టం అతడికి. ఒక వేళ లలితని పెళ్ళిచేసుకున్నాడనుకోండి. ఆ తరవాత ఈ ఇష్టం ఏర్పడి ఉంటే ఏమయ్యేది! దాని బ్రతుకు నరకమయ్యేది కాదూ. ఎన్ని సినిమాల్లో చూస్తున్నాం, ఎన్ని కథలు చదువుతున్నాం!" అంది.

నిజమేనా! నిజంలాగే ఉంది!

వాణిది స్వార్థమా, వివేకమా!

ప్రేమమైకమా; నిశితమైన పరిజ్ఞానమా!

వాణిని చూస్తుంటే కాంతికిరణాలు వాణిమీద పడుతూ ఆరుతూ, పడుతూ ఆరుతూ ఉన్నట్లుగా...స్వార్థమా... వివేకమా అంటూ కొట్టుకుంటోంది నా మనసు ... అప్పటిదాకా వాణి అంటే నాకు ఉన్న చిన్నచూపు తగ్గి కొంచెం ఎడ్మిరేషన్ కలిగిందని నేను ఒప్పుకోక తప్పదు.

ఒకరోజు స్థానిక పత్రిక ఒకటి తిరగేస్తున్నాను. దానిలో 'వాణి' ఫొటో చూసి నేను చెందిన ఆశ్చర్యం ఇంతా అంతాకాదు. ఒక ఏడాదిలో ఎనిమిదిసార్లు రక్తదానం చేసిన త్యాగమూర్తి "వాణి" అని వుంది.

వెంటనే పశ్చాత్తాపంకూడా కలిగింది నాకు. వాణిని గురించి ఎటువంటి దురభిప్రాయాలుండేవి నాకు. మంచి చీరలు కట్టుకుని షోకు చేసుకుని పార్టీలకి, సినిమాలకి తిరుగుతుంది. ఇంకే పనీలేదు, ఒక ప్రయోజనం లేదు, ఆదర్శమూ లేదు ఆ అమ్మాయి బ్రతుక్కి అనిపించేది తనని ఎప్పుడైనా ఎక్కడైనా చూసినప్పుడు.

మా మహిళా సమితి సెక్రటరీ నాతో అస్తమానం అంటుంది "కొత్త మెంబర్స్‌ని చేర్చండి. ఆక్టివ్‌గా ఉండే వాళ్ళు, సంఘసేవ ఇష్టం ఉన్నవాళ్ళు కావాలి" అని.

వాణికి పనీ పాటాలేదు. నాకు గుర్తు వచ్చింది కానీ ఆ పిల్లవల్ల ఏమీ కాదని

నాలో నేనే అనుకుని ఊరుకున్నాను.

బ్లడ్‌డొనేట్ చెయ్యమంటే ఒక్కరు ముందుకి రారు.

అసలు నేనుకూడా ఎప్పుడూ ఇవ్వలేదు.

అసలే నీరసం, గుండెదడ। నేను రక్తమిస్తే వెంటనే నాకింకెవరో రక్తదానం చెయ్యాల్సిందే అనుకునేదాన్ని... ఎప్పుడైనా ఇద్దామనిపిస్తే. అందుకనే ఊరుకున్నాను.

ఆరునెలల్లో ఆరుసార్లు రక్తదానం।

ఈ పిల్ల ఎట్లాగిచ్చింది, వాళ్ళెలా తీసుకున్నారసలు।

వాణిలో ఇంత త్యాగం ఉందని.... సంఘప్రేమ ఉందని నేను కలలోకూడా అనుకోలేను.

నాకేమిటో తలకిందులైనట్లూ ఉంది, సంతోషంగానూ ఉంది.

ఇంక ఆలశ్య మెందుకూ।

వాణిని మహిళా సమితిలో చేర్పించాలి. ఒక అభినందన సభ చెయ్యాలి. రిక్షా చేసుకుని, లలితదగ్గర ఎడ్రస్ తీసుకుని వాణి ఇంటికి వెళ్ళాను.

వాణి డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చుంది.

ఆపిల్ ముక్కలు కోసుకుని తింటోంది.

''మీరు వచ్చారంటే ఏమిటో విశేషం ఉందనిపిస్తోంది" అంది నేను కూచున్నాక.

''అంతా కులాసాయేనా ?" అనడిగాను.

"ఆ రంగనాథ్ వచ్చి మూడు నెలలయింది. మీకు తెలుసునా అమెరికాలో ఏడాది ఉండి వచ్చారు. ఒక నెలనుంచీ నాకు వంట్లో బాగుండటంలేదు. డాక్టర్ దగ్గరికి వెళ్ళాను. బాగా తినమంది. అందుకే పళ్లూ, పాలూ తీసుకుంటున్నాను శ్రద్ధగా. ఇప్పుడు దోకులూ, తల తిరగటం తగ్గిపోయాయి లెండి" అంది నవ్వుతూ.

ముందుగా నేను కొంచెం గాబరా పడినమాట నిజమే.

మరి అన్నిసార్లు రక్తమిస్తే ఏమవుతుంది ఆరోగ్యం పాడవక. అనిపించింది. కానీ ఆ నవ్వు చూస్తుంటే ... దోకులు, తలతిరగటం అంటోంది.....

నేను వాణి వేపు అనుమానంతో చూస్తున్నాను.

"ఇప్పుడు నాకు మూడో నెలండీ" అంది వాణి నా ఇబ్బందిగ్రహించినట్లు.

"కంగ్రాచ్యులేషన్స్" అన్నాను సంతోషంగా; అని వెంటనే -

"అసలు నిన్ను అభినందించటానికే వచ్చాను వాణీ. నిన్ననే చూశాను నీ ఫొటో పత్రికలో" అన్నాను.

"ఓ అదా !" అంది వాణి.

"అన్నిసార్లు రక్తదానం చెయ్యటం మాటలా। ఎంత త్యాగం, సాహసం ఉండాలి !" అన్నాను. వాణి నవ్వింది.

"అప్పుడు రంగనాథ్ అమెరికాలో వున్నారు. నేను ఇక్కడ ఒంటరిగా వున్నాను. తోచక అమ్మదగ్గరకి వెళ్ళే దాన్ని. విసుగుపుట్టి మీ యింటికి వచ్చే దాన్ని...సినిమాలు చూసేదాన్ని. లలితా నేను షాపింగ్ చేసి కావలసిన వన్నీ కొనుక్కునే వాళ్ళం. ఈ అవసరాలు, సరదాలూ అన్నీ తీరిపోతున్నా...ఇంకా తీరని కోరికలు.... వేదన...సుఖపడాలని లాలస, నిలవలేనితనం. అతడికి నేనంటే ఇష్టం ... నాకు అతడంటే ఇష్టం, ప్రేమకి అర్థం ఏమిటి? నాకు ఇంత బలం, ఇంత ఆరోగ్యం, ఇంత డబ్బూ ఉండబట్టే కదూ ఈ కోరికలు వేధిం చటం! అతడిని ప్రేమిస్తూ, అతడు నన్ను ప్రేమిస్తున్నాడని తెలిసి ఎందుకీ చిలిపితనం! అశాంతి. బ్లడ్ ఇచ్చి వస్తే ఆ రోజు నా మనసు చాలా విశ్రాంతి పొందేది. నా బలం తగ్గినట్లు, నీరసంగా అనిపించి మనసు శాంతిగా ఉండేది ఆ రకంగా శాంతిగా ఉండటంలో నాకు హాయిగా వుండేది. రంగనాథ్ కోసం ఇట్లా వున్నాను అనుకుంటే తృప్తిగా వుండేది. దానికోసం మళ్ళీ మళ్ళీ రక్తం ఇచ్చాను" అంది.

నాకు నోటమాట రాలేదు. వాణికి అభినందన సభ ఏర్పాటు చెయ్యటమా మానటమా తేల్చుకోలేక పోతున్నాను. నా మనసు వాణిది "స్వార్థమా! త్యాగం కాదా?" అని ఆలోచనలో పడింది. వాణిమీద లైటు వెలుగుతూ ఆరుతూ, వెలుగుతూ ఆరుతూ వుంది.

కామేశ్వరిని చూసి చాలా రోజు లైంది.

తనని నెలకొక సారైనా చూస్తే కానీ నాకు తోచదు. ఇద్దరం మెట్రిక్ దాకా కలిసి చదువుకున్నాం. నేను టీచర్ని అయ్యాను తను పెళ్ళి చేసుకుని ముగ్గురు పిల్లల తల్లి అయింది. ఇద్దరు కొడుకులూ ఒక కూతురు.

కామేశ్వరి నేను ఎప్పుడు వెళ్ళినా నవ్వుతూ కబుర్లు చెప్తుంది. తినడానికి ఏదో ఒకటి పెడుతుంది. మంచి కాఫీ ఇస్తుంది. కామేశ్వరి భర్త మంచివాడు. అందుకే కామేశ్వరి అన్నపూర్ణలా ఉండగలిగింది నాకు ఏమాత్రం చికాకుగా ఉన్నా కామేశ్వరి గుర్తు వస్తుంది, వాళ్ళింటికి వెళ్ళి వస్తే సేదదీరినట్లుగా ఉంటుంది. అటువంటిది ఒకసారి నేను వెళ్ళేటప్పటికి వీధివరండాలో నిలబడి ఉంది కామేశ్వరి. మొహంలో రవ్వంతైనా కళాకాంతీ లేవు. నన్ను చూడగానే ఏడిచేస్తుందేమో అనిపించింది.

నా మొహంలోకి రాబోయిన నవ్వు ఆగిపోయింది.

"ఏమిటట్లాగున్నావూ!" అన్నాను.

"కూర్చో" అంది అక్కడే ఉన్న కుర్చీలు చూపిస్తూ. నిలబడలేనింక అన్నట్లుగా తనూ ఒక కుర్చీలో కూలబడింది.

"రవి కనిపించటం లేదు" అంది. రవి వాళ్ళ రెండో అబ్బాయి.

"అదేమిటి! కనిపించక పోవటమేమిటి!" అన్నాను.

స్కూలునించి వచ్చాక ఆడుకోటానికి వెళ్ళాడు. ఆటల్లో ఏవో దెబ్బలాటలొచ్చాయట. డాక్టర్‌గారి బాబుల్ వాణ్ణి ఓడిపోయావని ఎక్కిరించాడుట. వీడు వాణ్ణి తిట్టాడట. వాళ్ళబాబుల్ మళ్ళీ రవిని ఒక దెబ్బకొట్టి పారిపోయాడట. వీడికి చాలా కోపం వచ్చింది, ఎట్లాగైనా మళ్ళీ వాణ్ణి కొట్టాలని వెంట పడ్డాడుట. వాడు తప్పించుకుని చివరకి వాళ్ళింట్లో దూరి తలుపేసు కున్నాడు. పిల్లలంతా వాళ్ళ వెంట పడ్డారు. చాలా సేపు రవి డాక్టర్‌గారి ఇంటి బయట నుంచున్నాడుట. తరవాత పరిగెత్తి ఎటో వెళ్లాడట పిల్లలంతా వాడి వెంట పరిగెత్తారట కానీ వాడు ఎటు వెళ్ళాడో కనిపించలేదు! కాలవవేపు వెళ్ళాడని ఎవరో అన్నారు."

చటుక్కున కామేశ్వరి చీర మొహానికి చాటు చేసుకుంది. ఏడవటం మొదలు పెట్టింది. ఏమి చెయ్యాలో నాకు తెలీలేదు. నిజానికి నాక్కూడా భయం వేసింది కాలవమాట విని ఐనా పైకి ప్రకటించకుండా కామేశ్వరిని మందలించాను.

నీకేమన్నా మతిపోయిందా, ఇప్పుడే మైందని ఏడుస్తున్నావ్! ఆడుకోటానికి వెళ్ళాడు వాడే వస్తాడు. పిల్లలు ఆటల్లో కొట్టుకుంటూనే ఉంటారు."

"నీకు తెలీదువాడి సంగతి.అందరిలా కాదువాడు. ఎవరైనా వాడినే మైనా అంటే సహించలేడు. కొడితే మళ్ళా కొట్టి తీరాల్సిందే. రాము వాడిలాగాకాదు వెంటనే మరచిపోతాడు. ఓసారి రాముతో దెబ్బలాడాడు. ఆ రోజంతా అన్నం తినలేదు. గదిలో తలుపులు వేసుకుని కూర్చున్నాడు. ఎంత పిలిచినా తలుపు తియ్యలేదు, ఇంకొకసారి పడితే పక్కింటి బేబీ నవ్విందని ఎటో వెళ్ళి పోయాడు. మేమెంత వెదికినా దొరకలేదు. రాత్రి అయ్యాక వాడంతటవాడే వచ్చాడు కోపం వస్తే ఏం చేస్తాడో తెలీదు...."

"మూర్తిగారేరీ ...... ఆఫీసునుంచి వచ్చారా!"

"ఆ రాగానే కాఫీ కూడా తాగలేదు. వాణ్ణి వెతకడానికి వెళ్ళారు."

మళ్లీ కామేశ్వరి ముఖం నల్లబడు తోంది.

"ఇంతేం వెతుక్కు వస్తారులే వాడికి కోపం వస్తే అట్లాగచెయ్యటం అలవాటే అంటున్నావుగా! కాసేపు ఎక్కడో కూచుని వాడే వస్తాడు." అన్నాను ... ... ధైర్యం కలిగించాలని.

మూర్తి స్కూటర్ చప్పుడయింది. వెంటనే అటు చూశాం నేను కామేశ్వరి. వెనకాల పిల్లవాడు లేడు. ఆశ

నీరు కారిపోయింది.

"ఏం...కనిపించ లేదా!" అంది కామేశ్వరి ఏడుపు గొంతుతో....కళ్ళలో నీళ్ళొచ్చేశాయి.

"పిల్లలు చెప్పిన చోట్లన్నీ వెతికాను... లేదు..."

ఇంకా మూర్తి స్కూటర్‌నుంచి దిగలేదు...ఎవరో పిల్లలు వచ్చి నుంచున్నారు:

"వెళ్ళండి... ఆ కాలవలో వెతికించండి...మళ్ళీ వాణ్ని చూస్తానో లేదో.. నా మొహానికి అంత అదృష్టం..." పడిపోతుందేమో అనిపించింది. కామేశ్వరి మెడ వాలిపోయింది. కామేశ్వరిని గట్టిగా పట్టుకున్నాను.

"మీరు వెళ్ళి ఇంకెక్కడైనా వెతకండి. ఎటు పోతాడూ. కామేశ్వరి ఊరికే భయపడుతోంది. అక్కడే ఉంటాడు. వెళ్లండి." అన్నాను.

"నాకు తెలుసు వాడిక్కడే ఎక్కడో ఉంటాడు. మధ్యలో దీని ఏడుపు చూస్తేనే నాకు భయంగా ఉంది" అని మూర్తి వెళ్ళిపోయాడు. వెనకాల పిల్లలు కూడా పరిగెత్తారు.

వాడేమైపోయాడో నేను మాత్రం రాయిలా ఉన్నాను. వెక్కి వెక్కి ఏడుస్తోంది మళ్ళీ.

తెలీకుండా నువ్వు అశుభం అనకూడదు. నేను చెప్తున్నాను. వాడికేమీ కాదు కళ్ళు తుడుచుకో సమంగా కూచో" అన్నాను.

కామేశ్వరి సర్దుకు కూర్చుంది.

"వాడికా కోపమేమిటో, పంతమేమిటో అర్థంకాదు. వాడు ఎట్లా బతుకుతాడో" అంది.

"ఆ(, చిన్నతనం పెద్దవాళ్ళైతే అన్నీ సర్దుకుపోతాయి. బాగానే బతుకుతారు, ఊరకే మనం భయపడి చస్తాం కానీ." అన్నాను

నాకు మా మావయ్య మొదటిభార్య గుర్తువచ్చింది. "కొంతమందిలో హానాయిత్వం వుంటుంది. ఎదుటి వాళ్ళని ఊరికే భయపెడుతుంటారు ఇట్లాంటి పనులుచేసి మా మామయ్య మొదటిభార్య ఇట్లాగే అస్తమానం నూతిలో పడతానని బెదిరించేది. అందరూ బ్రతిమిలాడేవారు" అన్నాను.

అంటున్నాను కానీ అసలు సంగతి అదికాదు. అసలు సంగతి గురించి ఆలోచిస్తున్నాను నేను. మామయ్య చదువుకునేవాడు మెడ్రాస్‌లో. అత్తయ్య తన అత్తగారి దగ్గర ఉండేది ఆకలేసినా అన్నం పెట్టమని అడిగేది కాదుట. వూరికే వుందికదా అని స్కూలుకి వెళ్ళమన్నారుట. స్కూలికి వెళ్ళి వచ్చేటప్పటికి ఆకలిగా వుండేది జానకికి. అత్తగారు అలిసి పడుకునేది. పెట్టుకు తినమనేది. ఈ పిల్ల తినేది కాదు. పిల్లేమరి. అప్పుడు పద్నాలుగేళ్లట. ఒకరోజు ఆవిడ విసుక్కుందిట.

కానీ లేచిరాలేదు. సాయంత్రం అయ్యాక కోడలేదని వెతుక్కుందిట. చివరికి నూతిలో తేలుతూ కనిపించిందిట. పూర్వకాలంలో సంగతే .... కానీ జానకి మనసులో ఏముందో అని ఇప్పటికీ నేను ఆలోచిస్తుంటాను. అది చిన్న తనమూ, లోకజ్ఞానం లేకపోవటమా ? అంతే అయి ఉండాలి. దానికి తోడు అభిమానం. అహంకారం. ఒక్క మాట అంటే పడకపోతే కష్టమే. నూతిలో పడటమే ! ఆ అత్త గారి మీద నాకు చాలా జాలేస్తున్నది.

"నేనేమీ అనలేదు .... అన్నం పెట్టుకు తినమన్నాను. అంతే" అని గోల పెట్టిందటావిడ. ఏంచేస్తారూ, నీళ్ళు తోడుతూ మా బావిలో పడిందని చెప్పుకున్నారు.

మనిషి బ్రతకాలంటే ఈ పసి దశ దాటి, అహంకారాన్ని, అభిమానాన్నీ గూడా జయించాలి. జ్ఞానోదయం కావాలి – ఈ తెరలన్నీ తొలగిపోయి..

రవి కోపంలో అటువంటి దేం చెయ్యలేదు కదా !

నా గుండె దడ దడ లాడుతోంది. నాకే ఇట్లాగుందే, మరి కామేశ్వరికి ఎట్లా ఉండాలి !

"నువ్విలాగంటావు కానీ. మాకు రెండిళ్ళవతల రామారావుగారని ఉన్నారు. ఆయన చాలా స్ట్రిక్టు. పిల్లలకి ఆయనంటే హడలు. రెండేళ్ళ క్రిందట వాళ్ళబ్బాయి మెట్రిక్ పరీక్షకి వెళ్ళాడు. పరీక్ష బాగానే రాశానన్నాడు. రిజల్టు వచ్చేదాకా బాగానే ఉన్నాడు. ఆడుకునే వాడు. తిని తిరిగేవాడు. రిజల్ట్సు వచ్చాయి. పేపర్లో మోహన్ నెంబర్ లేదు.

"ఇంటికి రానీ వెధవని !" అన్నారాయన.

"ఏం చేద్దామనుకున్నారో ఆయన... కానీ ఆ పిల్లవాడు ఇంటికి రాలేదు. ఇప్పటిదాకా రాలేదు. అప్పుడు ఆవిణ్ణి చూసి ఎంత జాలి వేసేదో ... ఇప్పుడు నాకూ అదేగతి"


పిల్లలు సంతోషంగా కేక లేస్తున్నారు.

"రవి వచ్చేశాడు. రవొచ్చాడు ...." అంటూ పద్మ పరిగెత్తుకువచ్చింది తల్లి దగ్గరికి.

కామేశ్వరిలో ప్రాణం ఊపిరి పోసుకుంది. ఒక్క ఉదుటున లేచింది. వరండాలో దీపం వేసింది. దీపం వెలుతురులో వాడి చెయ్యి పట్టుకుని మొహం చూసింది. రవే !

"నువ్వెవరైనా పోతే ఎవ్వరికీ బాధ లేదురా. నేను మాత్రం ఏడుస్తాను. ఈ బాధ నేను భరించలేను. నీ కెవరి మీదైనా కోపం వస్తే పోనీ నన్ను కొట్టు కానీ ఎటూ వెళ్ళబోకు" అంది.

వాడికి మాటలు అర్థమవుతాయా. చెయ్యి విదిలించుకొని అందరూ




చూస్తున్నారన్న సిగ్గుతో లోపలికి వెళ్ళిపోయాడు.

పిల్లలు ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళారు.

"రవిగాడు వచ్చేశాట్టగా!" అంటూ మూర్తి వచ్చాడు.

"ఇంక నాకూ, నీ స్నేహితురాలికీ కాస్త కాఫీ పొయ్యి" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

"కాఫీ కాదు, స్వీటుకూడా పెడతాను. అంటూ వంటింట్లోకి వెళ్ళింది కామేశ్వరి. పదినిముషాల్లో హల్వా చేసి తెచ్చింది. వేడిగా రుచిగా ఉంది. తింటున్నాము.

''ఎట్లాబతుకుతాడో వీడు!'' అన్న కామేశ్వరి మాటలే ఆలోచనల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

జానకి మనసులో ఏముంది! మోహన్ ఏమైపోయాడు! రవి ఎట్లా బతుకుతాడు! నా మనసొక ప్రశ్నార్థకాల చిత్తరువై పోయింది.

* * *

చిన్నప్పటినుంచీ నాది అంత మంచి ఆరోగ్యం కాదు. తరచూ జ్వరం, ఆయాసం వస్తుండేవి. ఎవరు చూసినా వయసు వస్తే తగ్గిపోతుంది అనేవారు.

నాన్న చాలామంది డాక్టర్లకి చూపించి, ఎన్నో మందులు తాగించారు నాచేత.

తగ్గినట్లే తగ్గి మళ్ళీ వస్తుండేది ఆయాసం.

పదహారేళ్ళు వస్తే ఇంట్లో ఆడపిల్ల పెళ్ళి ప్రసక్తి వస్తుంది.

''మా బావకి నన్ను ఇవ్వాలనే ఉద్దేశం ఉంది మా యింట్లో.

(మిగతా 79 వ పేజీలో)

(28 వ పేజీ తరువాయి)

"నాకు దిగులుగా ఉండేది పెళ్ళి అంటే...

పెళ్ళి మాటలు జరుగుతుండగా బాబు మా ఇంటికి వచ్చాడు.

అమ్మవంటింట్లో ఉండగా చూసి.

"నువ్వు ఈ పెళ్ళికి ఒప్పుకోకు బావా." అన్నాను.

"ఎందుకని ?" అన్నాడు బాబు నన్ను పరిశీలనగా చూస్తూ.

"నన్ను చేసుకుని నువ్వు సుఖపడ లేవు. నాకు ఆయాసం వుంది .... ఎప్పుడూ నీరసం" అన్నాను.

"అది తెలిసిన సంగతే "

"తెలిసి అసలు చేసుకోకూడదు. కష్టాల్ని వరించకూడదు" అన్నాను.

"అందరూ అట్లాగ ఆలోచిస్తే ప్రపంచంలో నిలవ నీడ వుండదు. ఒక వేళ పెళ్ళయ్యాకే నా భార్యకి జబ్బు చేస్తే...."

"నువ్వు చాలా మంచివాడివని ఒప్పుకుంటున్నాను. కానీ ఈ రోగం తగ్గితే కానీ నేను పెళ్ళిచేసుకోను. ఇది తగ్గదని నాకు తెలుసు."

"ఐతే పెళ్ళి చేసుకోకుండా వుండి పోతావన్నమాట ?" అన్నాడు.

నవ్వాను. కానీ నవ్వుతూ తీసుకున్న ఆ నిర్ణయం నాకు కత్తికోత అయింది. బాబు సహృదయంతో చెయ్యి అందిస్తే ఎందుకు 'వద్దు' అన్నాను.

అది నిజంగా త్యాగమా ?

త్యాగమనిపించుకోవాలనే కాంక్షతో కూడిన స్వార్థమా !"

తర్వాత నా ఆరోగ్యం బాగుపడింది. బాబుని పెళ్ళి చేసుకుని ఉండాల్సింది అనిపించేది. ఆరోగ్యం బాగున్నా, మనసులోకి విచారం ప్రవేశిస్తేచాలు మళ్ళీ నుస్తీచేసేది. జ్వరం, ఆయాసం, నీరసం కాలంకూడా అమ్మనీ నాన్ననీ నాకు దూరం చేసింది.

బాబుని చేసుకుంటే ఏమైయుండేది. ఇప్పటిలాగ రాయిలాగ బ్రతకడంగాక సహజంగా బ్రతికేదాన్ని ! బ్రతుక్కి నవ్వుతూ, కన్నీళ్ళూ సహజం అతడిని పెళ్ళిచేసుకుని అతడు సుఖపెట్టినప్పుడు నవ్వుతూ, అతడు నిరసించినప్పుడు కన్నీళ్ళు కారుస్తుంటే ఇంతకంటే అర్ధవంతమయ్యేదా బ్రతుకు !

లేక ఒకళ్ళనొకళ్ళు తిట్టుకుంటూ.

అతడి జీవితానికి నేనొక శాపంలాగ గుదిబండలాగ...

నాజీవితానికి అతడొక సవాల్‌గా ....

కత్తి అంచుమీద, మంటలమధ్యా ఉండేవాళ్ళామా !

టీచర్‌గా పదేళ్ళు గడిచాయికానీ .... ఈ ఆలోచనలకి మార్పురాలేదు. నాకు వాటికి సమాధానాలూ దొరకలేదు. కొన్నాళ్ళు కులాసాగా ఉంటుంది మళ్ళీ ఈ ఆలోచనలు ప్రారంభమవుతాయి... మళ్ళీ నా ఆరోగ్యం చెడిపోతుంది.

నా బ్రతుకు ఇట్లాగే గడిచిపోతుంది. ఇంక మలుపులు ఉండవనుకున్నాను.

అత్తయ్య .... బాబూ వాళ్లమ్మ దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది.

ఆ ఉత్తరం నాలో సంచలనం కలిగించింది. బాబు భార్యపోయిందిట. వాళ్లకి ఇద్దరు పిల్లలు కొడుకు ఏడేళ్ళవాడు, కూతురు నాలుగేళ్ళది. పిల్లల గురించి, అతడి గురించి బాధపడుతూ రాసింది అత్తయ్య.

ఇదేమిటి ఇట్లా జరిగింది! దీనిలో నాకేమైనా సంబంధం ఉందా? ఉందనే అనిపిస్తోంది. ఆరోగ్యం బాగుండదని నేను తిరస్కరించాను. ఆరోగ్యం బాగున్న సుజాత అకస్మాత్తుగా పోయింది.

బాబుని పెళ్ళి చేసుకుని ఉంటే అని ఎన్నిసార్లు ఆలోచించాను.

ఇప్పుడిది ఒక అవకాశమా?

అప్పుడైతే అతడికి నేను తగనను కున్నాను.

ఇప్పుడతడి దుఃఖం మరిపించటానికి ఒకరు కావాలి. ఒకరికొకరు తోడు కాగలం.

అతడి దుఃఖాన్ని మరిపించటంలో నేనూ నా దుఃఖం మరచి పోగలను.

కానీ ఎట్లాగ?

బాబు మళ్ళీ అడుగుతాడా "నన్ను పెళ్ళిచేసుకో. నా దగ్గర ఉండిపో" అని.

అత్తయ్య అడుగుతుందా!

లేకపోతే నేనే ముందడుగు వెయ్యాలా, "నీ సంసార బాధ్యత నేను వహిస్తాను" అని. అవసరమైతే అట్లాగే చెయ్యాలి.

ప్రయాణమయ్యాను. వాళ్ళింటికి చేరుకున్నాను.

అప్పటికి సుజాత పోయి నలభైరోజులయింది.

నేనూహించినంత దుఃఖం, సమస్యలూ కనిపించ లేదక్కడ.

అక్కడ ప్రేమలత ఉంది. ప్రేమలత సుజాత చెల్లెలు.

బాబు ప్రేమలతని పెళ్ళిచేసుకోడానికి నిశ్చయం జరిగింది.

అసలు వాళ్ళిద్దరూ పెళ్ళయిన వాళ్ళలాగే వున్నారు

"పెళ్లయ్యాక నా భార్యకి జబ్బు చేస్తే...." అని నాకు చెయ్యి అందివ్వటానికి సిద్ధపడిన బాబు ఎక్కడా కనిపించలేదు.

నరమాంసం రుచిచూసిన పులి గుర్తు వచ్చింది నాకు.

నాకు భయం వేసింది. విరక్తి కలిగింది. ఐనా అంతా మనుషులే! నేనూ మనిషినే.

"పిల్లలకి ప్రేమలత అంటే ఇష్టం. అభిమానం ఉన్నాయి. బాబుకి ఇంక సమస్యలేదు" అత్తయ్యతో అని ఇంటికి వచ్చేశాను.

ఇంక నాకు మాట్లాడాలని లేదు— నేను ఏ బొమ్మా సరిగ్గా గియ్యలేను.

●